టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



వేములపూడి విద్యార్థులతో ట్రస్ట్ చైర్మన్ అల్లాడ సురేష్, వార్డెన్ బాబూరావు



ముషిడిపల్లిలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు

నర్సీపట్నం: వేములపూడి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థులకు అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడ సురేష్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల(తురకబడి)ని దత్తత తీసుకుని పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వార్డెన్ బాబూరావు, ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి, మోపాడ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: ముషిడిపల్లి జెడ్పీ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.పూజ్య మేఘన సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన డబ్బూరు సన్యాసయ్య, అప్పలనర్సమ్మ దంపతుల జ్ఞాపకార్థంగా వారి పెద్ద కుమారుడు కన్నయ్య, రమణమ్మ దంపతులు వీటిని సమకూర్చారు. హెచ్ఎం బి.అప్పలరాము, పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, హెచ్‌వీ లక్ష్మి పాల్గొన్నారు.

డెయిరీ రైతులకు పండగ బోనస్

కె.కోటపాడు: పాల రైతులకు పండగ బోనస్ అందిస్తున్నట్లు విశాఖ డెయిరీ వైస్ చైర్మన్ పిళ్లా రమాకుమారి తెలిపారు. సోమవారం చౌడువాడ పాల సంఘం వద్ద కె.కోటపాడు యూనిట్ పరిధిలోని 150 పాల సంఘాల్లో సభ్య రైతులకు పండగ బోనస్‌గా రూ.5.70 కోట్ల చెక్కును పాల సంఘాల అధ్యక్షులు, రైతులకు ఆమె అందజేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, విశాఖ డెయిరీ డైరెక్టర్లు సుందరపు గంగాధర్, గేదెల సత్యనారాయణ, శీరంరెడ్డి సూర్యనారాయణ, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పాల సంఘం అధ్యక్షుడు కొమార వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు కొమార ఎర్రునాయుడు, వేతన కార్యదర్శి చిన్ని వెంకట నర్సింహమూర్తి పాల్గొన్నారు.

స్వామిత్ర సర్వేపై కార్యదర్శులకు శిక్షణ

మాకవరపాలెం: గ్రామాల్లో చేపట్టే స్వామిత్ర సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. సోమవారం పైడిపాలలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఈ గ్రామ మ్యాపు ద్వారా శిక్షణ ఇచ్చారు. సర్వే ఏవిధంగా చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామ కంఠం భూములపై పూర్తిస్థాయిలో సర్వే చేస్తామన్నారు. కార్యదర్శి, వీఆర్వో, సర్వేయరు సంయుక్తంగా గ్రామ కంఠంలో ఖాళీ భూమితోపాటు ప్రైవేటు, ప్రభుత్వ కట్టడాల వివరాలను సర్వే చేసి ప్రత్యేకంగా ఒక ఐడీ ఇస్తామన్నారు.

వంట నిర్వాహకులకు దుస్తుల పంపిణీ

నర్సీపట్నం: మండలంలో యరకన్నపాలెం మండల పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు, ఆయాకు సంక్రాంతి పండగను పురస్కరించుకుని హెచ్ఎం ఆళ్ల వరప్రసాద్ దుస్తులు పంపిణీ చేశారు. ఏటా మాదిరిగానే తన సంతోషంతో వంట పనివారికి, ఆయాకు దుస్తులు అందజేశానని హెచ్ఎం పేర్కొన్నారు.

రైవాడ పంచాయతీ అభివృద్ధికి కృషి

దేవరాపల్లి: రైవాడ గ్రామ పంచాయతీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ చల్లా లక్ష్మి తెలిపారు. స్థానిక సచివాలయంలో సోమవారం గ్రామసభ జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధి పనులను కార్యదర్శి జామి అప్పారావు వివరించారు. .

విచారణ చేయాలి

గొలుగొండ: నాగాపురంలో టీడీపీ నేతలు కక్షపూరితంగా ఫిర్యాదులు చేస్తున్నారని సర్పంచ్ యలమంచిలి రఘురాం, ఎంపీపీ గజ్జలపు మణికుమారి ఆరోపించారు. నాగాపురం గ్రామ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. 2014–18 వరకు టీడీపీ నేతలు అనేక అక్రమాలు చేశారని ఆరోపించారు. అప్పటి పాలన, గత వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి పనులపై విచారణ నిర్వహిస్తే నిజాలు బయటపడతాయన్నారు. దీనిపై పలు సమస్యలతో ఎంపీడీవో మేరీరోజ్‌కు ఫిర్యాదు చేశారు.

మానవ జీవనశైలి మార్పుల వల్ల క్యాన్సర్



మహారాణిపేట: మానవ జీవనశైలి మార్పుల వల్లే క్యాన్సర్ (రాచపుండు) బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. క్యాన్సర్‌లో పురుషులు, స్త్రీలు పోటా పోటీగా పెరుగుతున్నారు. స్త్రీల్లో ఎక్కువగా రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితులు పురుషులు కన్నా ఎక్కువగా ఉన్నారు. కేజీహెచ్‌లో కేన్సర్‌కు అద్భుతమైన చికిత్స అందిస్తున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి క్యాన్సర్ బాధితులు చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు వస్తున్నారు. కేజీహెచ్‌లో క్యాన్సర్ విభాగాన్ని గత ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేసింది. దీనికి అవసరమైన పరికరాలు, వైద్యుల నియామకం జరిగింది. 12 వేల నుంచి 15 వేల వరకు కేసులు వస్తున్నాయి. కేసుల పెరుగుదల ఏటా 12 నుంచి 16 శాతం వరకు ఉందని వైద్యులు చెబుతున్నారు. కేజీహెచ్‌లో సీఎస్ఆర్ బ్లాక్ మొదటి అంతస్తులో క్యాన్సర్‌కు సంబంధించిన పలు విభాగాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ వార్డు హేమటో–అంకాలజీ, పీడియాట్రిక్ అంకాలజీ, పల్లేలిటివ్ కేర్ వార్డులు ఏర్పాటు చేశారు. ఈ వార్డుకు అవసరమైన పరికరాలను గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఇచ్చారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో వారానికి మూడు రోజుల పాటు ఓపీ పర్యవేక్షణ జరుగుతోంది. సోమవారం, బుధవారం, శుక్రవారం ఓపీలను అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శిల్పా నిర్వహిస్తున్నారు. ఓపీకి 125 నుంచి 150 వరకు బాధితులు వస్తున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం దేశంలో జీవన శైలిలో వచ్చిన మార్పులు, కాలుష్య ప్రభావం, అలవాట్లు, వ్యసనాలు, జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యం వల్ల క్యాన్సర్ విజృంభిస్తోంది. గతంలో పొగతాగే వారికి మాత్రమే సోకే లంగ్ క్యాన్సర్ ఇప్పుడు అనేక మందికి సోకుతోంది. ప్రకృతి పరంగా దొరికే ఆహారం లేకపోవడం, అర్బన్‌లో ఎక్కువగా జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతున్న ప్రజలు లివర్ పేగుల క్యాన్సర్‌కు గురవుతున్నారని వైద్యులు చెబుతున్నారు. తగినంత వ్యాయామం లేకపోవడం వల్ల, పొగాకు వినియోగం, ఖైనీ, ఆల్కహాల్, అల్ట్రా–ప్రోసెస్డ్ ఫుడ్‌ల వినియోగం వల్ల లక్షలాది మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. వ్యాయమం చేయడం, ఊబకాయాన్ని నివారించడం ద్వారా, జీవనశైలి మార్పులు ద్వారా క్యాన్సర్ నివారణ చేయవచ్చు. భారత ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్, ఏపీలో ఆరోగ్యశ్రీ పథకం దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వారందరికి క్యాన్సర్ సంరక్షణను అందిస్తున్నారు.

ఎంతోమంది క్యాన్సర్ జయించారు

తొలి దశలో గుర్తిస్తే ఎలాంటి క్యాన్సర్ అయినా నివారణ చేయడానికి వీలు ఉంటుంది. ఆహారపు అలవాట్లు, మద్యం, పొగాకు వల్ల క్యాన్సర్ రోజు రోజుకు విస్తరిస్తోంది. ఎక్కువ మంది జంక్‌ఫుడ్, కొలస్ట్రాల్ వచ్చే ఆహారం తినడం వల్ల, ఊబకాయం వల్ల క్యాన్సర్ సోకుతుంది. ప్రతి మనిషి తన జీవన శైలిలో వ్యాయామం తప్పకుండా చేయాలి. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ ఎక్కువ మంది మహిళలకు సోకుతోంది. వీటిని తొలి దశలో గుర్తించే అధునాతన పరికరాలు వచ్చాయి. అందువల్ల భయపడవలసిన అవసరం లేదు.

– డాక్టర్ బి. రవిశంకర్, మేనేజింగ్ డైరెక్టర్, ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి, విశాఖపట్నం

విద్య, వైద్య, వాణిజ్య కేంద్రంగా నర్సీపట్నం

నర్సీపట్నం: విద్య, వైద్య, వ్యాపార రంగాలతో దినదినాభివృద్ధి చెందుతుండటంతో నర్సీపట్నం ప్రాధాన్యతను సంతరించుకుంది. రియల్ ఎస్టేట్, ప్రైవేటు ఆస్పత్రులు, జ్యువెలరీ షాపులు, షాపింగ్ మాల్స్‌కు నర్సీపట్నం కేంద్రంగా నిలుస్తోంది. బంగారు ఆభరణాల తయారీకి పెట్టింది పేరు నర్సీపట్నం. నిత్యం ఇక్కడ బంగారం విక్రయాలు రూ. కోట్లలో జరుగుతుంటాయి. విద్యా రంగంలో ముందంజలో ఉంది. కార్పొరేట్‌కు పాఠశాలలతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డాక్టర్ రాజేంద్రప్రసాద్ కళాశాల, శ్రీప్రగతి కళాశాల, ఏబీఎం విద్యా సంస్థలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. పట్టణ ప్రజలతోపాటు గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యం అందుబాటులో ఉంది. ఆటో మొబైల్ రంగంలో ప్రాధాన్యత సంతరించుకుంది.

నమ్మకానికి..నాణ్యతకు మారు పేరు నాయుడు జ్యూయలర్స్..



మల్టీమాల్స్ తరహాలో నర్సీపట్నంలో నాయుడు జ్యూయలర్స్ రూపుదిద్దుకుంది. పట్టణ నడిబొడ్డులో దశాబ్దాల కింద చిన్న జ్యూయలరీ షాపుతో ప్రారంభించిన వ్యాపారం మల్టీమాల్ స్థాయికి తీసుకువచ్చారు. శుభకార్యాలకు, పండగలకు గుర్తుకు వచ్చేది న్యాయుడు జ్యూయలర్స్ మాత్రమే. గ్రామీణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కస్టమర్లను ఆకట్టుకునేందుకు అనేక మోడల్స్ అందిస్తున్నామని మాల్ అధినేత గోవింద్ తెలియజేశారు.

టాపర్స్‌కు కేరాఫ్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ కళాశాల..



కార్పొరేట్ కళాశాలకు దీటుగా నర్సీపట్నంలో దశాబ్దాల కాలం నుంచి శ్రీసాయి విద్యా సంస్థల వారి డాక్టర్ రాజేంద్రప్రసాద్ కళాశాల రూపుదిద్దుకుంది. ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో 2016 నుంచి ఏటా టౌన్ ఫస్టులు అందిస్తూ, 2023 ఇంటర్ ఫలితాల్లో బైపీసీలో స్టేట్ ఫస్ట్, ఎంపీసీలో స్టేట్ సెకండ్ సాధించింది. ఎంసెట్ తరహాలో పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో 5వ ర్యాంకు, నీట్‌లో రెండు సీట్లు సాధించారు. ఐఐటీ మెయిన్స్, ఎంసెట్, నీట్ కోచింగ్‌లో ప్రత్యేక తర్ఫీదు ఇస్తూ, విద్యార్థుల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహిస్తున్నామని కరస్పాండెంట్ పి.నాగరాజు, డైరెక్టర్ ఎ.గోపాలరావు తెలిపారు.

వ్యాపార రంగంలో సుదీర్ఘ అనుభవం...



టెక్నీషియన్, డీసీ ఆటో ఎలక్ట్రీషియన్, బ్యాటరీ మ్యాన్‌ఫ్యాక్చర్‌గా సాయి దుర్గా బ్యాటరీ వర్క్స్ అధినేత రుత్తల శ్రీనువాసరావు 1988లో కెరీయర్‌ను ప్రారంభించారు. 36 ఏళ్లుగా నాలుగు కంపెనీల డీలర్ షిప్ కలిగి ఉన్నారు. జర్మన్ టెక్నాలజీకి సంబంధించి ఎస్ఎఫ్ సోనిక్ బ్యాటరీలు ఉమ్మడి విశాఖ, రూరల్ జిల్లా డిస్ట్రిబ్యూటర్‌గా వ్యాపార రంగంలో దూసుకుపోతున్నారు. వ్యాపార రంగంలో సాధిస్తున్న పురోభివృద్ధితో 12 దేశాలు సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్, దుబాయ్, అబుదబీ, మారిషస్, సౌతాఫ్రికా మొదలగు దేశాల్లో అనేక సార్లు ఆయా కంపెనీల ప్రతినిధుల కాన్ఫరెన్స్‌లో అవార్డులు అందుకున్నారు. వ్యాపారమే కాకుండా స్థానికంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరీ మన్ననలు పొందుతున్నారు.

మాధుర్యానికి మారు పేరు ఎం.మంగీలాల్ స్వీట్స్...



పట్టణంలో మాధుర్యానికి మారు పేరుగా ఎం.మంగీలాల్ స్వీట్స్ ప్రసిద్ధి గాంచింది. ప్రజలకు తీయదనాన్ని ఇవ్వడంతో పాటు వంద మందికి ఉపాధి కల్పిస్తున్నారు. మా నాన్న గారు ఎం.మంగీలాల్ 1960లో కాకినాడలో స్వీట్ స్టాల్‌ను ప్రారంభించారని అధినేత ఎం.మహేష్ కుమార్ తెలిపారు. కాకినాడ నుంచి 1990లో నర్సీపట్నంలో మా నాన్న పేరు మీద స్వీట్‌స్టాల్‌ను ప్రారంభించారు. నాన్న గారు మరణ అనంతరం నిర్వాహణ బాధ్యతలు చేపట్టాను. వివాహాది శుభ కార్యాలకు ప్రత్యేక ఆర్డర్లపై తయారు చేసి ఇవ్వడంతో జిల్లాలో ప్రసిద్ధిగాంచామని తెలిపారు.

సిరి రెస్టారెంట్..



క్వాలిటీకి, క్వాంటీకి ప్రసిద్ధి సిరి రెస్టారెంట్. 15 ఏళ్ల క్రితం ప్రారంభించిన వ్యాపారం నాలుగు జిల్లాలో రోజూ అన్ని ఫంక్షన్‌లకు క్యాటరింగ్‌పై రుచికరమైన వెజ్, నాన్‌వెజ్ భోజనాన్ని అందిస్తున్నామని అధినేత సిహెచ్. శ్రీనువాస్ తెలిపారు. అనకాపల్లి, విశాఖ, అల్లూరి, కాకినాడ, రాజమండ్రి వరకు సప్లయి చేస్తున్నామని తెలిపారు.

క్వాలిటీ కేరాఫ్ అంబికా స్వీట్స్...



పెద్దబొడ్డేపల్లిలో 25 ఏళ్లుగా అంబికా స్వీట్స్ అండ్ బేకరీ ప్రారంభించామని నిర్వాహకుడు శంకర్‌లా తెలిపారు. హాట్‌తో పాటు స్వీట్స్ అందిస్తున్నామన్నారు. బెంగాలీ ఐటమ్, కోవా స్వీట్స్, కాజ్‌బర్ఫీ, ఆంధ్రా పిండి వంటలు మా ప్రత్యేకత అన్నారు. వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేక ఆర్డర్‌పై అందిస్తున్నామన్నారు. దినదినం మేము అందిస్తున్న సర్వీస్సుకు ప్రజలు మంచి సహకారాన్ని అందిస్తూ వ్యాపార అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని తెలిపారు.

టాపర్స్‌ను అందిస్తున్న ప్రగతి కళాశాల..



ఎ.అప్పలనాయుడు (డైరెక్టర్, ప్రిన్సిపాల్) ఉలబాల సత్తిబాబు (కరస్పాండెంట్, సెక్రటరీ)

ప్రగతి జూనియర్ కళాశాల విద్యా రంగంలో దూసుకుపోతోంది. 2016లో కళాశాల ఏర్పాటైందని కరస్పాండెంట్ ఉలబాల సత్తిబాబు, డైరెక్టర్ ఎ.అప్పలనాయుడు(బాబ్జి) తెలిపారు. కళాశాల ప్రారంభం నుంచి టౌన్ టాపర్స్‌గా తమ కళాశాల విద్యార్థులు నిలుస్తున్నారన్నారు. ఐఐటీ జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ మొదలగు పోటీ పరీక్షలకు నిత్యం తర్ఫీదు ఇస్తున్నామన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామన్నారు. 2024లో ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించామని, నీట్‌లోనూ మంచి ఫలితాలు సాధించామన్నారు.

ఉత్తమ విద్యకు కేరాఫ్ ఏబీఎం విద్యా సంస్థలు



విద్యా రంగంలో ఏబీఎం విద్యా సంస్థలు దూసుకుపోతున్నాయి. గ్రామీణ విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించటమే లక్ష్యంగా పట్టణంలో 2006లో విద్యా సంస్థలను ప్రారంభించామని కరస్పాండెంట్ ఎ.గిరిబాబు తెలిపారు. అప్పటి నుంచి ఇంటర్, డిగ్రీల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ 300 మందికి పైగా విద్యార్థులు వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగులుగా స్థిరపడటం గర్వంగా ఉందన్నారు. వీరిలో ఇద్దరు డాక్టర్లుగా స్థిరపడ్డారని తెలిపారు.

దూసుకుపోతున్న సాయిదుర్గ ఎస్టేట్స్..



రాజమండ్రికి చెందిన సాయిదుర్గ ఎస్టేట్స్ నిర్మాణ రంగంలో దూసుకుపోతోంది. రియల్ ఎస్టేట్ రంగంలో 25 ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో అనేక వెంచర్స్ పూర్తి చేసి, ఇటీవల నర్సీపట్నం సమీపంలోని అప్పన్నదొరపాలెం మెయిన్ రోడ్డుకు ఆనుకుని కొత్తగా వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ వీఎంఆర్డీఏ అప్రూవల్ చేయబడిన లేఅవుట్, బిగ్గెస్ట్ గేటు కమ్యూనిటీతో నిర్మాణం చేస్తున్నారు. ఇందులో ప్రీమియం హౌస్స్, విల్లాస్ తక్కువ రేట్లకే అందుబాటులో ఉన్నాయని మేనేజింగ్ డైరెక్టర్ బెజవాడ హరే రామకృష్ణ తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు సహచర విద్యార్థుల సత్కారం

చోడవరం రూరల్: అడ్డూరులోని ఓ ప్రైవేటు రిసార్టులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం అలనాటి ముచ్చట్లు, ఎమ్మెల్సీగా, విప్‌గా ఉన్నత స్థాయికి ఎదిగిన తమ సహచరుడికి సత్కారం వంటి సందర్భాలతో ముందుగానే సంక్రాంతి సంబరం వచ్చిందా అన్నట్టుగా సాగింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1991–94 విద్యా సంవత్సరాలలో డిగ్రీ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 33 ఏళ్ల క్రితం నాటి ముచ్చట్లతో వారంతా మురిసి పోయారు. ఈ సందర్భంగా తమతో చదువుకుని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్‌గా ఎదిగిన వేపాడ చిరంజీవిరావును ఘనంగా సత్కరించారు. తామంతా ఒక చోట చేరి గత స్మృతులను స్ఫురణకు తెచ్చుకోవడానికి వీలు కల్పించిన రమాకాంత్ బాబ్జీ, భూషణం, నాగేశ్వరరావు, నాయుడుబాబు, గౌరినాయుడుల కృషి ఇతర సహచరులు అభినందించారు.

తల్లికి వందనం అమలు చేయాలని ఆందోళన

నర్సీపట్నం: తల్లికి వందనం పథకాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. కార్యాలయం ఏవో సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని వచ్చే ఏడాది నుంచి కాకుండా ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలన్నారు. విద్యార్థి సంఘ నాయకులు కిరణ్, హర్షిత, శృతిరాజు తదితరులు పాల్గొన్నారు.

జీసీజీటీఏ సంయుక్త కార్యదర్శిగా పైడిరాజు



పైడిరాజును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి తదితరులు

మాడుగుల: గవర్నమెంట్ కాలేజెస్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీజీటీఏ) జిల్లా సంయుక్త కార్యదర్శిగా స్థానిక డిగ్రీ కళాశాల, తెలుగు ఉపన్యాసకుడు పులపర్తి పైడిరాజు ఎంపికయ్యారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో సి.వి.ఎస్.ఎస్ శాస్త్రి, తోటి ఉపన్యాసకులు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

10న చేతివృత్తుల రిజిస్ట్రేషన్ మేళా

నర్సీపట్నం: చేతివృత్తుల వారికి మెప్మా ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. స్థానిక మెప్మా కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన రిజిస్ట్రేషన్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే తమ సిబ్బంది 180 మంది చేతివృత్తిదారులను సేకరించారన్నారు. ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, ఏసీ, ఫ్రిడ్జ్, గీజర్లు, టీవీ, వాషింగ్ మెషిన్లు మరమ్మతులతో పాటు బ్యూటీషియన్(మెన్ అండ్ ఉమెన్) వృత్తుల్లో ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వివరాలు మెప్మా అధికారులకు అందించాలన్నారు. ఆయా వృత్తులకు సంబంధించిన వారి వివరాలను హోమ్ ట్రయాంగిల్ యాప్‌లో పొందుపరుస్తామన్నారు. వారి సేవలను ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచటం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. విద్యార్హతకు సంబంధించి జెరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తును మెప్మా కార్యాలయంలో సమర్పించాలన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి వెండి బహూకరణ



వెండి అందజేస్తున్న దాత సత్యనారాయణ

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన సాకా సత్యనారాయణ కుటుంబ సభ్యులు పావు కిలో వెండిని బహూకరించారు. సోమవారం సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. ప్రధాన అర్చకులు, నాయకులు పడాల అప్పలనాయుడు, నాగేశ్వరరావు, జె. హరిప్రసాదు, నాగరాజు, రాజేశ్‌కుమార్, మూర్తి పాల్గొన్నారు.

మోదకొండమ్మ చీరల వేలం

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మకు భక్తులు సమర్పించిన చీరల వేలం పాట సోమవారం స్థానిక దేవీ ఆలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ వేలంలో గ్రామంతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పోటీ పడ్డారు. అమ్మవారి చీర లభిస్తే మంచి జరుగుతుందని నమ్మకంతో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

7 ఎకరాల 'బంజరు' స్వాధీనం

బుచ్చెయ్యపేట: రాజాంలో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న ఏడెకరాల బంజరు భూమిని రెవెన్యూ సిబ్బంది సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సర్వే నెంబరు 328లో ఏడెకాల్లో మునగపాకకు చెందిన కొంతమంది ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చెయ్యగా, తహసీల్దారు ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

క్యాన్సర్ నివారణ సాధ్యమే..